క్లుప్తంగా

ఆలయంలో అన్నదానం



అర్వపల్లి దేవాలయంలో అన్నదానం చేస్తున్న షేక్ లతీఫ్, పాల్గొన్న నాయకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రతిరోజూ భక్తులు అన్నదానం చేస్తున్నారు. ఆదివారం జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన మైనార్టీ నాయకుడు షేక్ లతీఫ్–లుబీనాబేగం దంపతులు దేవాలయానికి వచ్చి హిందువులతో కలిసి అన్నదానం చేశారు. అన్ని మతాలు సమానమేనని.. అందరికీ దేవుడొక్కడేనని ఈ సందర్భంగా లతీఫ్ పేర్కొన్నారు. దేవాలయంలో భక్తులకు అన్నదానం చేయడానికి అవకాశం కల్పించిన జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, దేవాలయ చైర్మన్ సీహెచ్.విద్యాసాగర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, ఉపసర్పంచ్ ప్రభాకర్, దేవాలయ డైరెక్టర్ ప్రభు, దాతలు యాగానందం, భిక్షం, శ్రవణ్, దబ్బేటి నరేష్, ముస్లింలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాసిరకం

నూతనకల్ : మండల కేంద్రంలోని సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న సీసీరోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపించాయని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివా రం ఆర్ అండ్‌బీ డీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రూ. 2.50 కోట్ల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. మెయిన్ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న లింకురోడ్లకు, సీసీతో అనుసంధానంగా ఉన్న రోడ్లకు సీసీ స్లోప్ నిర్మించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంటా నాగయ్య, పోలెబోయిన కిరణ్, దేసోజు మధు, పిడమర్తి భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



వెలిశాలలో నరేష్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

తిరుమలగిరి : వెలిశాల గ్రామానికి చెందిన జనగామ నరేష్‌కు 2003–04 పదవ తరగతి స్నేహితులు ఆదివారం రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ స్నేహితులను ఆదుకోవడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

చీదెళ్ల ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో నిర్వహించిన శ్రీలక్ష్మీతిరపతమ్మగోపయ్య స్వాముల జాతర హుండీ లెక్కింపును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి మాట్లాడారు. హుండీ ఆదాయం రూ.2లక్షల 94,438 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, రాజీవ్‌గాంధీ, గోపయ్య, పిచ్చయ్య, తిరపయ్య, రమేష్, జాల సైదులు, చాంద్, నాగయ్య, వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి, బాదరబోయిన గోపయ్య, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల దిగ్బంధం విజయవంతం చేయాలి

చివ్వెంల : చట్టసభలో ఏబీసీడీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలో చేపట్టే జాతీయ రహదారి దిగ్బంధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం మండల కన్వీనర్ చెరుకుపల్లి కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో నిర్వహించిన ఆ సంఘం గ్రామ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ యడవల్లి సోమశేఖర్ పాల్గొన్నారు.

దేవతామూర్తుల విగ్రహాలకు జలాభిషేకం

మోతె : మండలంలోని కొత్తగూడెం గ్రామంలో గల శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ఆదివారం వార్షిక కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. కల్యాణంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

‘ఉపాధి’లో సౌకర్యాల కొరత

- పని ప్రదేశాల్లో కొరవడుతున్న కనీస వసతులు
- ఎండాకాలం సమీపిస్తుండటంతో ఆందోళనలో కూలీలు



లింగాలలో పని చేస్తున్న ఉపాధి కూలీలు

పెన్‌పహాడ్ : జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు పనిచేసే ప్రదేశంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో వారు అష్టకష్టాలు పడుతున్నారు. వేసవి కాలం సమీపిస్తున్నా.. నిబంధనల ప్రకారం కల్పించాల్సిన వసతులపై అధికారులు దృష్టి సారించడం లేదు. ఇప్పటికే ఎండల తీవ్రత పెరగడంతో పాటు పనికి సంబంధించిన పరికరాలు అందక పని చేసేందుకు కూలీలు ఇబ్బంది పడుతున్నారు. వీరికి గతంలో పని ప్రదేశంలో గుడారాల ఏర్పాటు, తాగునీటి వసతి, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచేవారు. కానీ ప్రస్తుతం కనీసం భోజన సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి వసతి లేక కూలీలు తంటాలు పడుతున్నారు. ఉపాధి పనులు కొనసాగుతున్న ప్రదేశాల్లో కూలీలకు నీడ కోసం గ్రీన్ షేడ్ నెట్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. పట్టించుకునే వారు కరువయ్యారు. వీటికి తోడు బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుండటం, ప్రస్తుతం వ్యవసాయ పనులు ఉండటంతో ఉపాధి పనులకు వెళ్లేందుకు కూలీలు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం హరితహారం నర్సరీల పనుల్లో కొందరు పనిచేస్తున్నారు.

ఏళ్లుగా అందని కిట్లు..

ఉపాధి కూలీలకు ఏళ్లుగా పార, గడ్డపార, తట్టలు తదితర సామగ్రి అందడం లేదు. సొంతంగా వాటిని సమకూర్చుకోవడానికి వారు ఇబ్బంది పడుతున్నారు. ఎండ తీవ్రత క్రమంగా పెరగతుండటంతో కూలీలు తాగునీటిని వెంట తీసుకెళ్తున్నారు. పనిచేసే సమయంలో ఎండ తీవ్రను తట్టుకోలేక సమీపంలోని చెట్టు నీడలో కొంతసేపు సేద తీరుతున్నారు. ఇప్పటికైనా పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించడంతో పాటు పెండింగ్‌లోని కూలి డబ్బులను వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కూలీలు అధికారులను కోరుతున్నారు.

కూలి రేటు పెంచాలి..

ఉపాధి హామీ పథకం కింద కష్టపడి పనిచేస్తున్నా.. కూలి రేటు గిట్టుబాటు కావడం లేదని కూలీలు వాపోతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో బతుకుదెరువు భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు రూ. 246 అందాల్సి ఉండగా రూ. 120కి మించి రావడం లేదని వాపోతున్నారు. ఏడాదికి కనీసం 200 పనిదినాలు పెంచడంతో పాటు కూలి రేట్లు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వసతులు కల్పించేందుకు చర్యలు



“ప్రస్తుతం ఉపాధి కూలీల పనులు ప్రారంభమవుతున్నాయి. దీంతో పాటు వేసవి సమీపిస్తున్నందున కూలీలకు పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. కూలీల సంఖ్య పెరిగేలా చూస్తున్నాం. ఆధార్‌తో ఉపాధి కార్డుల అనుసంధానం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. నర్సరీల్లో, క్షేత్రస్థాయిలో మొక్కలు పెంచేందుకు కృషి చేస్తున్నాం.

– రవి, ఏపీఓ

విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ధర్నా



చివ్వెంల : జి.తిర్మలగిరిలో సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు



పెన్‌పహాడ్ : సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

చివ్వెంల : మండలంలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని జి.తిర్మలగిరి సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల పిలుపు మేరకు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిట్ట రాంరెడ్డి ఆదేశాలతో రైతులతో కలిసి ధర్నా నిర్వహించినట్లు పార్టీ మండల కర్వీనర్ మూగ వెంకట్రామిరెడ్డి తెలిపారు. ప్రభుత్వం వెంటనే నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల సంజీవ, నల్లబోతు రాఘవారెడ్డి, నెమ్మాది మల్సూర్, ఎండీ రఫీ, సరిత, అంజి, సురేష్, గోపిరెడ్డి, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

24గంటల విద్యుత్ అందించాలి

పెన్‌పహాడ్ : రైతులకు 24గంటల విద్యుత్‌ను అందించాలని వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు తాడోజు జనార్దనచారి అన్నారు. ఆదివారం వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరా సరిగాలేక పోవడంతో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం 24గంటల విద్యుత్ అందించి పంట పొలాలు ఎండిపోకుండా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బచ్చలకూరి రవి, మామిడి పరశురాంగౌడ్, మేకల సైదులు, సురేష్, నాగయ్య, హుస్సేన్, రాములు, అంజి, నాగయ్య, సత్యం, గోపి, సైదులు, ప్రేమ్‌కుమార్, బందేలి, రామాచారి, పాపచారి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల పాత్ర కీలకం

పెన్‌పహాడ్ : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందించడంలో గ్రామీణ వైద్యుల పాత్ర కీలకమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పాల లక్ష్మీనర్సయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆర్ఎంపీ, పీఎంపీల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దేశగాని జానయ్య, ఉపాధ్యక్షుడిగా ధరావత్ రాంబాబు, ప్రధాన కార్యదర్శి గద్దల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా అందిమళ్ల రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా మాది వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శిగా జలగం సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ జోనల్‌నాయకులు రాజేందర్, రహీమతుల్లా, డాంగేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎంపీ, పీఎంపీల నూతన కార్యవర్గ సభ్యులు

ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు మోక్షం కలిగేనా..?

- నియోజకవర్గంలోని మండలాలకు అందుబాటులో లేని ఫైర్‌స్టేషన్
- అగ్ని ప్రమాదం జరిగితే సూర్యాపేటలోని ఫైరింజన్‌లే దిక్కు
- సమయానికి మంటలు ఆర్పలేక భారీగా నష్టపోతున్న బాధితులు



తుంగతుర్తి : పేరుగొప్ప ఊరు దిబ్బఅన్నచందగా మారింది తుంగతుర్తి నియోజకవర్గ పరిస్థితి. పేరుకే నియోజకవర్గం కానీ ఇక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేకపోవడం గమనార్హం. నియోజకవర్గ కేంద్రంలో 6 ఆరు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో ఎలాంటి అగ్ని ప్రమాదం జరిగినా అందుబాటులో ఫైర్‌స్టేషన్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకర్గంలోని వివిధ గ్రామాల్లో గత వేసవిలో వేల మోపుల గడ్డివాములు అగ్నికి ఆహుతైనాయి. అలాగే రావులపల్లి ఎక్స్‌రోడ్డు తండాలో విద్యుత్‌షాక్‌తో పూరిళ్లు పూర్తిగా కాలిదగ్ధమైంది. అందుబాటులో ఫైర్‌స్టేషన్ ఉంటే కొంత వరకైన నష్టం తప్పేది. నియోజకవర్గానికి సూర్యాపేట 40 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇస్తే అది సూర్యాపేట నుంచి నియోజకవర్గ కేంద్రానికి చేరుకునే సరికి గడ్డివాములు కాలిబూడిదైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇటీవల తుంగతుర్తి మండలంలోని సంగెం, నాగారం మండల కేంద్రంలో అగ్ని ప్రమాదంలో రెండు ఇళ్లు దగ్ధమైనాయి. ఆ సమయంలో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా అది వచ్చేసరికి ఆ ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. తుంగతుర్తి పట్టణం మిగతా మండలాలకు మధ్యలో ఉండటంతో ఈ ప్రాంతంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే చుట్టుపక్క మండలాలకు అందుబాటులో ఉండి అగ్ని ప్రమాదాలు నివారించడానికి వీలుగా ఉంటుందని ప్రజలు అంటున్నారు. ఇప్పట్కైన అధికారులు, పాలకులు స్పందించి తుంగతుర్తిలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి



“నియోజకవర్గ కేంద్రంలో ఫైర్‌స్టేషన్ లేకపోవడంతో ఇబ్బందులు అవుతున్నా యి. ఈ ప్రాంతంలో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అందుబాటులో ఫైర్ స్టేషన్ లేకపోవడంతో ప్రమాదాన్ని నివారించలేకపోతున్నాం. 40 కిలోమీటర్ల దూరం నుంచి ఫైర్‌స్టేషన్ తుంగతుర్తి ప్రాంతం వైపు వచ్చేసరికి మంటలు అదుపులోకి రాక బాధితులు ఎంతో నష్టపోవాల్సి వస్తోంది. ఇప్పటికై నా అధికారులు స్పందించి ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి.

– తుమ్మ రామస్వామి, వైఎస్సార్‌టీపీ జిల్లా నాయకుడు

విగ్రహావిష్కరణ సభ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

అర్వపల్లి : ఎంసీపీఐయూ పొలిట్ బ్యూరో సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి దివంగత తాంద్రకుమార్, ప్రథమ వర్ధంతి, విగ్రహావిష్కరణ సభలను జయప్రదం చేయాలని ఎంసీపీఐయూ కేంద్ర కమిటీ సభ్యుడు వరికుప్పల వెంకన్న కోరారు. ఈ నెల 14 నుంచి 20వరకు జరిగే తాంద్రకుమార్ వర్ధంతి కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం అర్వపల్లిలో ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఈ వర్ధంతి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈదరు వీరపాపయ్య, నాయకులు పగిడిమర్రి రాజు, సుధీర్, వేముల పెదనర్సయ్య పాల్గొన్నారు.

పీడీ యాక్ట్ నమోదు చేయాలని వినతి



డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల హసేన్ అన్నారు. ఆదివారం ఈ మేరకు సూర్యాపేటలో డీఎస్పీ నాగభూషణంను కలిసి వినతిపత్రం అందించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రసాద్ దేశద్రోహి అన్నారు. ఇలాంటి వ్యక్తులకు సమాజంలో చోటు లేకుండా కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, వెంకటరత్నం, నామా వేణు, గాజుల నర్సయ్య, అఖిల్, నాగయ్య, కమలాకర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవాలు



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు



ముత్యాలమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బొడ్రాయికి జలాభిషేకం చేశారు. ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు.

పాదయాత్రకు తరలిన నాయకులు

కోదాడరూరల్ : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జనగామ జిల్లా పాలకుర్తి నుంచి ప్రారంభమైన పాదయాత్రకు కోదాడ మండల కార్మికులు ఆదివారం తరలివెళ్లారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. జీపీల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం తగిన న్యాయం చేసే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందన్నారు.

మాలమహానాడు నూతన కమిటీ ఎన్నిక

చిలుకూరు : మండలంలోని పోలేనిగూడెంలో మాల మహానాడు మండలం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఇట్టిమళ్ల మధు, ఉపాధ్యక్షుడిగా తిరగమళ్ల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా మామిడి నరసింహారావు, వర్కింగ్ అధ్యక్షుడిగా గుండు మధుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిడతల శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి జెట్టి శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు పాలడుగు నాగరాజు, నాయకులు పిడితల శంకర్‌రావు, నాగరాజు, రాఘవేంద్ర, అంజి, వెంకటేశ్వర్లు, శ్రీను, హరిబాబు, రాజు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ నరేష్

సూర్యాపేట క్రైం : వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం స్థానిక పోస్టాఫీసు వద్ద బండి నంబర్ ప్లేట్, వాహన పత్రాలు లేని వాహనదారులను గుర్తించి అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు ఇన్సూరెన్స్ తప్పకుండా తీసుకోవాలని, బండి కొనుగోలు చేసిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకొని బండి నంబర్ వేయించుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ నరేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, అశోక్, వెంకట్‌రెడ్డి, ఆరీఫ్, సైదులు, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ 11ఆర్ ఉపకాలువకు గండి



రామన్నగూడెం శివారులో 11ఆర్ కాలువకు పడిన గండి



వృథాగా పోతున్న గోదావరి జలాలు

- వారం రోజులుగా వృథాగా పోతున్న గోదావరి జలాలు
- కాలువ కట్టను పటిష్టం చేయాలని రైతుల వినతి

అర్వపల్లి : ఎస్సారెస్పీ రెండోదశ పరిధిలోని 71డీబీఎం కాలువకు అనుబంధంగా ఉన్న 11ఆర్ ఉపకాలువకు మండల పరిధిలోని రామన్నగూడెం శివారులో గండి పడింది. దీంతో గోదావరి జలాలు వృథాగా పోతున్నాయి. రామన్నగూడెంలోని రైతువేదిక వెనుక భాగంలోని ఈ ఉపకాలువకు కల్వర్టు వద్ద వారం క్రితం గండి పడి రోజురోజుకు ఎక్కువ అవుతుంది. ఈ ఉపకాలువ రామన్నగూడెం నుంచి అర్వపల్లి మీదుగా వెళ్లింది. ఈ కాలువ ద్వారా సుమారు 10నుంచి 12వరకు చెరువులు, కుంటలకు నీళ్లు అందుతున్నాయి. అదేవిధంగా ఈ కాలువ కింద 2,410ఎకరాల ఆయకట్టు ఉంది.

వృథాగా గోదావరి జలాలు..

ఈ 11ఆర్ ఉపకాలువకు వారం రోజుల కిందట చిన్నపాటి బుంగ పడి రోజురోజుకు వరద తాకిడికి పెరుగుతూ వస్తుంది. దీంతో గండి నుంచి గోదావరి జలాలు వృథాగా పోతున్నాయి. గడ్డి ఎక్కువగా పడితే ఆయకట్టు పొలాలకు నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయని వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఈ కాలువ కట్టను రెండు వైపులా పటిష్ట పరిచి గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలని కాల్వ ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

గండిని వెంటనే పూడ్చాలి



“రామన్నగూడెం నుంచి వెళ్లే 11ఆర్ ఉపకాలువకు గండి పడి గోదావరి జలాలు వృథాగా పోతున్నాయి. ఈగండిని పూడ్చి వేసి కాలువ కట్టలను పటిష్ట పరిచి నీటి వృథాను అరికట్టాలి. నష్టం వాటిల్లిక ముందే అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి.

– వజ్జె వినయ్, రైతు, రామన్నగూడెం

ఎస్సారెస్పీ కాలువ వంతెనపై ప్రమాదకరంగా..



ఎస్సారెస్పీ వంతెనపై రోడ్డు దుస్థితి



ప్రమాదకరంగా ఉన్న గుంత

అర్వపల్లి : మండల పరిధిలోని సూర్యాపేట–జనగామ 365బీ జాతీయ రహదారిపై ఉన్న పర్సాయపల్లి స్టేజీ నుంచి గ్రామం వరకు వెళ్లే రోడ్డు మధ్యలో ఎస్సారెస్పీ 71డీబీఎం కాలువ వంతెనపై, రోడ్డుకు రెండు వైపులా అప్రోచ్ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అప్రోచ్‌రోడ్లపై బీటీ లేచిపోయి పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అలాగే వంతెనపై సిమెంట్ లేచిపోయి గుంతలేర్పడి ప్రమాదకరంగా మారాయి. దీంతో నిత్యం ఈ గుంతల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ గుంతలను పూడ్చి దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతు చేయాలని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డు, వంతెనపై ఏర్పడిన గుంతలను పూడ్చివేసి ప్రమాదాలను అరికట్టాలని కోరుతున్నారు.

అప్పుల భారం మోపుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం



మాట్లాడుతున్న నరేష్

కోదాడఅర్బన్ : తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్కో వ్యక్తిపై రూ.2లక్షల50వేల అప్పుచేసి ప్రజలపై భారం మోపుతుందని, మిగుల బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేసిన కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ఓటు వేసి బీజేపీని గెలిపించాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అంబల నరేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 35వ వార్డులో శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్‌ను ఆ వార్డు ఇన్‌చార్జ్ పోలా సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. కేసీఆర్ కుటుంబ పాలనతో రాష్ట్ర ప్రజలకు తీరని నష్టం కలిగిందన్నారు. ఈ సమావేశంలో బూత్ కమిటీ అధ్యక్షుడు కొత్తా రామారావు, పట్టణ అధ్యక్షుడు నకిరికంటి జగన్‌మోహన్‌రావు, నల్లగొండ పార్లమెంట్ కో కన్వీనర్ యాద రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాతులూరి హనుమంతరావు, ఓరుగంటి పురుషోత్తం, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు కొటకొమ్ముల భాగ్యమ్మ, శంకర్‌రావు, కల్యాణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎంపీపీ, తదితరులు

కోదాడఅర్బన్ : పట్టణంలోని భవానీనగర్‌లో గల వరసిద్ధి వినాయకస్వామి ఆలయ మూడో వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి తెల్లవారుజాము నుంచే పంచామృతాభిషేకాలు, గణపతి పూజ, పుణ్యాహ వాచనం, లక్ష్మీగణపతి, నవగ్రహ హోమాలు, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలను బ్రాహ్మణులు నిర్వహించారు. కాగా ఆలయ వార్షికోత్సవానికి ఎంపీపీ చింత కవితారాధారెడ్డి హాజరై ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి అజంతాభాస్కర్, పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రమీల, డాక్టర్ శ్రీపతిరెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పెరిక కుల నిరుద్యోగ యువతకు శిక్షణ

కోదాడఅర్బన్ : జిల్లా పెరిక సంఘం, ఖైరతాబాద్ పెరిక హాస్టల్ ఆధ్వర్యంలో పెరిక కుల నిరుద్యోగ యువతీ, యువకులకు అందిస్తున్న ఉచిత గ్రూప్స్, పోలీస్ ఉద్యోగాల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఖైరతాబాద్ పెరిక కులం హాస్టల్స్ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల నాగార్జున, పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు వనపర్తి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సంఘం భవన్‌లో నిరుద్యోగ యువతీ, యువకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. హైదారాబాద్‌లో ఐఏఎస్ ర్యాంకులు సాధించిన ముత్తినేని వీరయ్య సారథ్యంలో నడుస్తున్న శ్రీరామానుజన్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు అభ్యర్థులకు రూ.వేయి ఉపకార వేతనాన్ని కూడా అందిస్తున్నామన్నారు. విద్యావంతులైన పెరిక కుల నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. సదస్సులో కోదాడ పెరిక హాస్టల్ అధ్యక్షుడు బోలిశెట్టి కృష్ణయ్య, పెరిక సంఘం నాయకులు జట్టుకొండ సత్యనారాయణ, రాంబాబు, రాజేష్, జయరామయ్య, వేణు, కృష్ణ, అనురాధ, అశోక్, శ్రీను, జనార్దన్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

నడిగూడెం : విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని విజయీభవ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు చారుగండ్ల రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో విజయీభవ ట్రస్టు ఆధ్వర్యంలో ‘పరీక్షలను ప్రేమించు–ఉన్నతంగా జీవించు’ అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. లాఫింగ్ థెరపీ, యోగా, ఆరోగ్య సూత్రాలు, నిద్ర ఆవశ్యకత, ఏకాగ్రత అంశాలపై వివరించారు.